

17న మినీ జాబ్ మేళా...

విశాలాంధ్ర-టెక్కలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా మినీ జాబ్ మేళా కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల టెక్కలిలో ఈ నెల 17న (గురువారం)ఉదయం 9.30గం.ల నుంచి నిర్వహించ బడుతుందని స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ టిరిటి సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో 3 స్థానిక బహుళజాతి(ఎంఎన్సిఎస్) కంపెనీలు పాల్గొంటున్నాయని అన్నారు. కావున అర్హత,ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేస్తారని, కావున అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరువ్వాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టునకు దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర-పలాస: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టునకు (గెస్ట్ ఫ్యాకల్టీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి ఆదివారం ప్రకటనలో కోరారు. ఆసక్తి గలవారు వెంటనే కళాశాలలో తమ బయోడేటా అందివ్వాలన్నారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు జరగనున్న ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలన్నారు.

సిరిపురం ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్షా వర్గ్ శిక్షణను పూర్తి చేసుకున్న సిరిపురం

విశాలాంధ్ర-కొత్తూరు: ఎచ్చెర్లలోని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంగణం లో గత వారం రోజులుగా జరిగిన ఈ శిక్షణ. కార్యాక్రమంలో పాతపట్నం బీజేపీ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు క్రియాశీల స్వయం సేవకుడిగా శిక్షన పొందారు. హిందూస్థాన్ కి జీవనాధారం హిందూ సంస్కృతి. దేశాన్ని రక్షించుకోవాలంటే హిందూ సంస్కృతిని పరిరక్షించుకోవాలి. ఈ అత్యున్నత కర్తవ్యం దిశగా లక్షలాది మంది యువత ని తీర్చిదిద్దటమే సంఘ లక్ష్యం. ఆ మహోన్నత లక్ష్యంలో నేను ఓ అణువు ను అవ్వాలనే సంకల్పంతో శిక్షణ పూర్తి చేసుకున్నా " అని ఈ సందర్భంగా సిరిపురం తేజేశ్వరరావు అన్నారు సనాతన ధర్మం, హైందవ సంస్కృతి పరిరక్షణ, దేశం మేలు కోసం పాటుపడటమే ఆర్ఎస్ఎస్ కి తెలుసని.. ఇది ఎవరికీ వ్యతిరేకం కాదని సిరిపురం అన్నారు.

"ఇంటి వద్దకే తపాలా సేవలు"

తపాలా సేవలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-టెక్కలి: ఇకనుండి మీ ఇంటి వద్దకే తపాలా కార్యాలయ సేవలు అందు తాయని మండల రెవెన్యూ అధికారి ఎం కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఉన్న తపాలా అధికారులతో ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తపాలా కార్యాలయంలో అందిస్తున్న సేవలు గురించి మాట్లాడుతూ పొదుపు పథకాలు, ప్రత్యేక ఆధార్ డ్రైవ్, పాస్పోర్ట్, అప్పుడే పుట్టిన చిన్నారులకు సుకన్య పథకాలు, జీవిత బీమా, ప్రమాద బీమా, డిజిటల్ పోస్టింగ్, బ్యాంకింగ్ టు ఆధార్ పేమెంట్స్ ఇలా మొదలైన సేవలను మీ ఇంటి వద్దనే చేసుకోవచ్చని తెలిపారు. తపాలాలో అందిస్తున్న సేవలు పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా కార్యాలయ అధికారి ఎన్ తిరుపతిరావు, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈవో జగన్నాథరావు, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు పిపిని సన్మానించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం తుంగం పంచాయతీ, చిన్న గ్రామానికి చెందిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ న్యాయవాది మెండ లక్ష్మీనారాయణ ను, కోటబొమ్మాళి మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సంతబొమ్మాళి మండలం చిన్న తుంగం గ్రామానికి వచ్చి పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వగృహంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లకినేని శ్రీనివాసరావు, కార్యదర్శి తిరుమలరావు, సీనియర్ న్యాయవాది పూజారి వాసుదేవరావు, పల్లి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైకాపా నాయకులు

- ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో పార్టీలో వైకాపా సీనియర్ నాయకుల చేరిక
- టిడిపి కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బొరివంక గొనప పుట్టుగ గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు గొనప సంతోష్ మరో 20 కుటుంబాలు, వైకాపా కార్యకర్తలు శనివారం విజయదశమి సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్య పుట్టుగలో టీడీపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే అశోక్ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పాలన తమకు ఎంతగానో ఆకట్టుకుంటుదని, ప్రజాదనం వృధా చేయకుండా పాలన సాగిస్తున్న చంద్రబాబు విధి విధానాలు నచ్చి టీడీపీలో చేయడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం

విశాలాంధ్ర-కవిటి: మండలం పరిది రాపాకపుట్టుగ, రాజపురం, కవిటి తదితర గ్రామాల్లో శరన్నవరాత్రుల సందర్భంగా 9 రోజుల పాటు పూజలందుకున్న దుర్గా మాతను ఆదివారం నిమజ్జన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు పూజలు నిర్వహించిన కుంబాలతో మహిళలు గ్రామాల్లో భారీ ఊరేగింపు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు.

సోంపేటలో సుజల వాటర్ పనులు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణంలో గడచిన ఐదు రోజులుగా సుజలా వాటర్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలో సుమారు 40వేలు జనాభా అవసరాలకు సరిపోయేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐదు ట్యాంకులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా. ఈ ఐదు ట్యాంకులకు ప్రతీ రోజు శుద్ధ జలాలను సరఫరా చేసే ట్యాంకర్ ఐదు రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా దాబా కాలనీలో నీరు నింపేందుకు వెళుతున్న ట్యాంకర్ అక్కడ దుర్గాపూజ అలంకరణలో భాగంగా ఏర్పాటు చేసిన స్తంభానికి కొద్దిమాత్రం పొరపాటున ఢీకొంది. దీంతో ట్యాంకర్ ఆపరేటర్కు, ఎలక్ట్రికల్ సిబ్బందికి జరిగిన వాగ్వాదంలో కొంత మంది పట్టణంలో గల ఈ ఐదు ట్యాంకులకు సంబంధించిన తాళాలను దౌర్జన్యంగా తీసుకున్నట్లు ట్రాక్టర్ డ్రైవర్ సోమేశ్వరరావు తెలిపారు. దీంతో నీటి సరఫరాతోపాటు ట్యాంకుల్లో నీరు నింపేందుకు అంతరాయం ఏర్పడి గడచిన ఐదు రోజులుగా పట్టణంలో నీటిపై ఆధారపడ్డ సుమారు 15వేలు జనాభా మంచినీరు లభించక కటకటలాడుతున్నారు. దీని పట్ల అధికారులు గానీ, పోలీసులు గానీ కనీసం చర్యలు తీసుకోకుండా అందరూ మౌనం దాల్చడంతో ఇంకా ఈ సమస్య యధావిధిగా కొనసాగుతోంది. సోంపేట ప్రజలు తాగునీరు ఎప్పుడు సరఫరా చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. పూజా కమిటీ తీరుపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామీణ క్రీడలకు ఆదరణ పెరగాలి

- కర్రసాము, తాలింఖానా మన క్రీడా సంపద
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రాచీన గ్రామీణ క్రీడలైన కర్ర సాము, తాళింఖానాలకు ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. శివతాలింఖానా వ్యాయామశాల 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గొండు శంకర్ ముఖ్యంగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గుండు శంకర్ మాట్లాడుతూ కర్రసాము, తాళింఖానా ఆత్మరక్షణ విద్యగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ గ్రామీణ క్రీడలు మన క్రీడా సంపదకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. మన పూర్వీకులు ఏ పండగ జరుపుకున్న ఖచ్చితంగా కర్రసాము, తాళింఖానా క్రీడలను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించే వారిని పేర్కొన్నారు. కానీ నేడు ఈ క్రీడలు రోజు రోజుకు కనుమరుగ వుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా కత్తిసాము, కరసాము చేస్తూ పలువురిని అలరించారు. ప్రతి దసరా పండుగ సందర్భంగా ఈ క్రీడలు ఆడే వారంతా ఒక్క దగ్గర కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. నేడు చదువుల పోటీలో పడి చిన్నారులు ఈ ఆటలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సూచించారు. శివ తాళింఖానా వ్యాయామశాల ఏర్పాటు చేసి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఈనాడు ఉన్న ప్రజాప్రతినిధులు, ఎందరో యువత ఇక్కడ వ్యాయామం చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పథకాలు సాధించారని చెప్పడం సంతోషకరమన్నారు.

ఇరుముడిని శిరస్సును దాల్చి విజయవాడకు పయనం

విశాలాంధ్ర-పోలాకి: అమ్మ దుర్గమ్మ తల్లికి వందనాలు అంటూ భవాని భక్తులు శనివారం పోలాకి పురవీధుల్లో తిరువీధి నిర్వహించినట్లు టంకాల శ్రీరాములు గురు భవాని రాజు గురు భవానిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గమ్మ గుడిలో 45 మంది భవాని భక్తులకు మాలలు ధరించి దీక్షలు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంకాల సమయంలో జిల్లా నలుమూలల నుండి కళాకారులచే రోజుకొక భజన బృందంతో భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భవాని భక్తులు తిరివీధిలో దీక్షలు ముగింపు సమయంతో డప్పు లు వాయిద్యాలు మధ్య అమ్మ దుర్గమ్మ తల్లి వందనాలు అంటూ ఆటపాటలతో అల రించారు. ఇంటింటా దుర్గమ్మ ను దర్శించుకునే భక్తులకుతీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం రాత్రి 10.గంటల సమయంలో భవాని లు ఇరుముడిని శిరస్సును దాల్చి విజయవాడ శ్రీ కనకదుర్గమ్మను మొక్కులు తీర్చుకునేందుకు ప్రయాణమైనట్లు గురుభవానిలు తెలిపారు.

పలాస నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

మంత్రి నారా లోకేష్ ను కలిసిన పలాస జనసేన నాయకులు

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు అంపోలు హరీష్ కుమార్ శ్రీకాంత్,డా.దుర్గారావులు అన్నారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో కలిసి పలాస నియోజకవర్గానికి సంబందించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు. ఎన్నికలలో జనసేన నాయకులు బాగా కష్టపడి పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష గెలుపు కృషి చేశారని లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పలాస రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ తీర్చాలని కోరారు. ఫ్లై ఓవర్ వంతెన పనులు ప్రారంభించి దాదాపు 16 ఏళ్లు కావస్తున్న మూడు ప్రభుత్వాలు మారినా దీనికి మోక్షం లేదని, పలాస నియోజకవర్గం ప్రజల ఆశలు తీరనూ లేదని వారు ఆవేదన వ్యక్తంం చేశారు. దీనిపైట్కట్కు లోకేష్ స్పందిస్తూ రోడ్లు భవనాల శాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేసి వీలైనంత త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.పలాస లో ఉన్న జ్యోతిరావు పూలే గురుకుల పాఠ శాలకు శాశ్వత భవ నాలు, హాస్టల్ కల్పిం చాలని కోరామన్నారు. అద్దె భవనాల్లో ఉంటూ పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని స్థలాన్ని ఎంపిక చేసి పక్క భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు.అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూండి జూనియర్ కళాశాలలకు కూడా శాశ్వత భవనాలు నిర్మిద్దామన్నారని తెలిపారు. ఆఫ్షోర్ రిజర్వాయర్, పలాసకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం,ఆధునిక విద్యతో కూడిన ప్రభుత్వ పాఠశాల, పూడిలంక వంతెన, జీడిపప్పు పరిశోధనా కేంద్రం పలాసకు తరలింపు, మత్స్యకార అభివృద్ధి కారిడార్, జిల్లాలో అనధికార మధ్యవర్తుల వలన గల్ఫ్ బాధితులు అధికమవుతున్నారని వారి కోసం ప్రత్యేక హెల్ప్లైన్ నెంబర్ ఏర్పాటు తో పాటు భవిష్యత్తులో గల్ఫ్ బోర్డు శ్రీకాకుళం లో ఏర్పాటు చేయాలని కోరమన్నారు. తమ సమస్యలను మంత్రి లోకేష్ వినేందుకు సమయం కేటాయించినందుకు ఆయనకు రుణపడి ఉంటామని జనసేన నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రమణమూర్తిని సన్మానం చేస్తున్న పాపినాయుడు

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలో మాకివలస గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి మండపాన్ని విజయదశమి సంధర్భంగా శనివారం రాత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేసి, యాగంలో పాల్గొని, అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ మాజీ ప్రత్యేక ఆహ్వానితులు, శిమ్మ పాపినాయుడు, ఎమ్మెల్యే, రమణమూర్తిని దుశ్శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు, శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్, యాళ్ళ వేణుగోపాలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి...

అంబేద్కర్ పల్లె బాట కార్యక్రమం దృశ్యం

విశాలాంధ్ర-టెక్కలి: మండలం లో లక్షన్నపేట గ్రామంలో ఆదివారం అంబేద్కర్ పల్లె బాట కార్యక్రమాన్ని దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడమే ఈ పల్లె బాట ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామాలలో చాలా సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా త్రాగునీరు, డ్రైనేజ్, స్మశాన వాటిక రహదారులు లేకపోవడం ఇలా మరికొన్ని ప్రధాన సమస్యలతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు, పాలకులకు వినతి పత్రాలు అందించిన ఎలాంటి ప్రయోజనమో లేదని వాపోయారు. గ్రామంలో ఉన్న సమస్యలపై చర్యలు తీసుకొని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేనిచో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

క్విజ్ పోటీలతో ప్రతిభకు మెరుగు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: వ్యక్తుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలిక తీయడానికి పోటీలు ప్రధాన పాత్రలు పోషిస్తాయని ఎమ్పిపి బోర పుష్ప అన్నారు. సరస్వతి దేవి పంచరాత్రి మహోత్సవాల్లో భాగంగా బూర్జపాడు గ్రామంలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. శమళ్ళ రాజబాబు, బాలక శ్రీనివాస్, నీలాచలం, భూషణంలు క్విజ్ మాస్టార్లుగా వ్యవహరించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ పద్దతులు అనుసరిస్తూ మేధస్సుకు పదును పెట్టే పోటీలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. క్విజ్ పోటీలు ప్రతిభను మెరుగుపర్చుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రధమ బహుమతిని కవిటి మండలం లండారిపుట్టుగ గ్రామ బృంధం దక్కించుకుంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల, టెక్కలి మండలం పూండీ జట్లు వరుసగా ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎమ్పిపి బోరపుష్ప, జెడ్పీటీసి ఉప్పాడ నారాయణమ్మ, జనసేన ఇన్చార్జి డి. రాజులు బహుమతులు అందించారు.

చెడుపై మంచి జయించే పండగ విజయదశమి

ఎచ్చెర్ల సాయుధ పోలీసు కార్యాలయంలో ఎస్పీ పూజలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: జీవితంలో సన్మార్గంలో నడిచేందుకు అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ లభించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కార్యాలయంలో విజయదశమి సందర్భంగా శనివారం ఆయుధ, వాహన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడుపై మంచి యొక్క విజయానికి నాందిగా ప్రజలం దరూ సంతోషంగా నిర్వహించే పండగ విజయదశమి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రాజశేఖర్, ఎల్.శేషాద్రి, సీఐలు ఇమ్మాన్యుయల్రాజు, ఆర్ ఐ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా 'రియల్ వెంచర్లు'!

- ఎటువంటి అనుమతులు లేకుండా విక్రయాలు
- రియాల్టర్స్ తో చేతులు కలుపుతున్న సిబ్బంది
- అక్రమాల నియంత్రణలో అధికారులకు సవాలు

కొలతలు చూపుతున్న బ్రోచర్, ప్రస్తుతం భూమి

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించుకునేందుకు అక్రమార్కులు కాసుకు కూర్చుంటారు. వారి స్వలాభం కోసం ఎంతటి వారినైనా ఇట్టే ఆకట్టుకుని ఎటువంటి అనుమతులు లేకున్నప్పటికీ వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఆముదాలవలస పట్టణంలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని తప్పుదారి పట్టించి వెంచర్ల ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. పట్టణం చుట్టూరా పంట పొలాలను చదును చేస్తూ అక్కడ ఉన్న పట్టా భూములను ప్రభుత్వ భూములను అందులో కలుపుకొని వెంచర్లు ఏర్పాటు చేసి దిగువస్థాయి సిబ్బందితో అధికారులను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నాళా చెల్లించకుండా డెవలప్మెంట్ అథారిటీ కి రుసుం చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండిపడే విధంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపట్టాల్సి వుంది. ప్రభుత్వ స్థలాన్ని ఒకరి పేరు పట్టాయిస్తూ మరొకరికి విక్రయించినట్లు లింక్ డాక్యుమెంట్లు తయారుచేసి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు వేసి కొనుగోలుదారుని మభ్యపెట్టి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వేసిన వెంచర్లు కనీస నియమ నిబంధనలు పాటించకుండా మునిసిపల్ అధికారుల అనుమతి లేకుండా విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. పట్టా భూముల్లో వెంచర్లు వేసి వ్యక్తులను నమ్మబలికి వాటిని విక్రయిస్తున్నారు. ఇటువంటి భూముల్లో యజమాని గృహ నిర్మాణానికి పాల్పడితే అప్పుడు ఈ అడ్డంకులన్నీ ఎదురై ప్రభుత్వ అనుమతులు వచ్చేందుకు సుమారు ఐదు ఆరు లక్షలు ఖర్చవుతుంది. ఇటు వంటి వారి బారినపడి భూమి కొనుగోలుతారు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తనకొచ్చే జీవితంలో బ్యాంకు లోన్ తీసుకొని బొడ్డేపల్లి పేట వద్ద స్థలం కొనుగోలుకు వ్యక్తి ప్రయత్నించగా అటువంటి అనుమతులు లేకపోవడంతో తన అగ్రిమెంట్ను రద్దు చేసుకున్నారు. ఈయన అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం విశేషం.

అక్రమాలు తొలి దశలో నియంత్రణ జరిగేనా...

ఇటువంటి వెంచర్లను తొలి దశలోనే నియంత్రించాల్సిన అధికారులు దిగువ స్థాయి సిబ్బంది మాటలు విని అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటువంటి వాటిని గుర్తించి నియంత్రంచాల్సింది అధికారులు అయినప్పటికీ కొంతమంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు వీరిని ప్రలోభాలకు గురిచేసి వెంచర్లు వేస్తున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో రియాల్టర్లకు కిందిస్థాయి ఉద్యోగులు అండగా ఉంటున్నారు. సైలాడ సచివాలయంలో విధులు నిర్వహించిన వ్యక్తి కనుసనల్లోనే ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి అనే చర్చ జరుగుతుంది. గడ్డ స్థలంలోని రాళ్లు తొలగిస్తున్న సమయంలో ఇరిగేషన్ అధికారి అడ్డుకోవడంతో ఆయనపై ఎమ్మెల్యేతో ఒత్తిడి తెచ్చి సుమారు 10 సెంట్లు ప్రభుత్వ భూమిని వారి ఖాతాలో కలుపుకున్నారు. అక్రమార్కులకు పార్టీ నేతలు అండగా ఉండడంతో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో అక్రమాలు నియంత్రణకు అధికారులకు సవాలుగా మారింది. సంగమయ్య కొండ దారిలో పట్టా భూమిలోనే వెంచర్లు వేసి ఎటువంటి నియమ నిబంధన లు పాటించకుండా కనీసం అనుమతులు లేకుండా విక్రయాలు చేస్తున్నారు. ఈ వెంచ ర్లు వేస్తున్న ప్రాంతంలో ఒకవైపు మైనింగ్ మరోవైపు సాగునీటి కాలువ ఉన్నాయి. సర్వే నెంబర్ 17-6 లో సాగుకి పనికిరాని విస్తీర్ణం 75 సెంట్లు కామిరెడ్డి అనురాధ వైఫ్ ఆఫ్ సూర్య ప్రకాశరావు పేరున పట్టా భూస్వభావం ఉంది. దానికి 18 అడుగుల వెడల్పుతో రోడ్లు ఉన్నట్లు ఒక్కో సెంటు 10 లక్షలు వరకు విక్రయాలు చేస్తున్నారు. అలికాం బత్తిలి రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ఆ భూమి కనీసం ఓ ఆకారం లేనప్పటికీ వెంచర్ దారులు సృష్టించిన బ్రోచర్స్ ఆధా రంగా అమ్మకాలు జరుపుతున్నారు. దీనికి సైలాడ సచివాలయం ఉద్యోగి అండగా ఉంటూ అధికారుల మధ్య సయోధ్యకుదురుస్తున్నట్లు తెలిసింది. అనుభవదారణ విస్తీర్ణం 75 సెంట్లు ఉన్నప్పటికీ కనీసం ఎకరా భూమిలో పిచ్చి మొక్కలను తొలగించారు. అటువైపు వైయోడక్టు 24 ఎల్ భూమిని ఆక్రమించుకొని కాలవ గట్టును రోడ్డుగా బ్రోచర్లో చూపిస్తున్నారు. సాగునీటి కాలువను ఆక్రమించుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొండ ప్రాంతం ఉండడంతో అటువైపు అధికారుల అనుమతి లేకుండా వెళ్లేందుకు వీలు లేన ప్పటికీ అధికార నాయకుల అండతో వెంచర్లు వెలుస్తున్నాయి. చంద్రబాబు బాధ్యతల స్వీకరించిన తర్వాత మైనింగ్ విధానంపై అనేక ఆంక్షలు విధించినప్పటికీ ఆ పార్టీ అధికారం లో ఉండడంతో ఇక్కడ రియాల్టర్ హవా కొనసాగుతోంది. వీటిని ఆనుకొని వెంచర్ వేస్తూ ఆ మిగులు భూమిని కూడా వీరి ఖాతాలలో కలుపుకుంటున్నారు. అటు మునిసిపాలిటీ ఇటు రెవిన్యూ ఇతర అనుమతులు లేనప్పటికీ యదేచ్ఛగా పట్టణం చుట్టూ వెంచర్లు వెలుస్తున్నాయి. సంగమయ్య కొండ దగ్గర అయితే ప్రభుత్వ భూముల్లో కూడా వెంచర్లు వేసి విక్రయిస్తున్నారు. భూముల్లో ఎటువంటి మార్పులు లేకుండా పిచ్చి మొక్క లను తొలగించి బ్రోచర్లలో కొలతలు చూపి కొంతమందిని ఆకట్టుకుని విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్ లోని హైడ్రా తరహా విధానం ఇక్కడ అమలయితే కొనుగోలుదారులు గొల్లు మనకతప్పదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇటువంటి వెంచర్లపై దృష్టి సారించి ప్రభుత్వ ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మార్కెట్ కమిటీ పంచన 'వ్యవసాయ' శాఖ ఏ.డి కార్యాలయం

ప్రభుత్వాలకు వ్యవసాయంపై ఉన్న శ్రద్ధ కార్యాలయాలపై లేదు

మార్కెట్ కమిటీలో వున్న వ్యవసాయశాఖ ఏ.డి కార్యాలయం దృశ్యం

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి ప్రతీ యేటా బడ్జెట్లో కోట్లాది రూపాయలు కేటాయించే ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల పై దృష్టి పెట్టడం లేదు. దీనివలన వ్యవసాయ శాఖకు చెందిన కార్యాలయాలు పరాయి పంచన పడి వున్నాయి. ప్రతీ ఐదేళ్ళకు ఒకసారి అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయి. నరసన్నపేటలో ఏ.డి కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన భవనంలో కాలం వెళ్లదీస్తోంది. వ్యవసాయం యాంత్రీకరణ ద్వారా చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పే, ప్రజా ప్రతినిధులు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు స్వంత భవనాలు వుండాలని ఆలోచించటం లేదు. గత వైసిపి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేసింది కాని, శిథిలావస్థలో వున్న మండల వ్యవసాయశాఖ కార్యాలయాల పైనా, వ్యవసాయశాఖ ఏ.డి కార్యాలయాలను నిర్మాణం చేయాలని ఆలోచించలేదు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు ఒక అసిస్టెంట్ డైరక్టర్(ఏ.డి) కార్యాలయం ఉంటుంది. అంతేకాక నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బంది సుమారు 400మంది ఉంటారు. రైతాంగానికి అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, అతివృష్టి, అనావృష్టి సమయాల్లో పంటలను అంచనా వేసి, ప్రణాళికలు ఏ.డి కార్యాలయంలో తయారుచేస్తారు. ఈ సిబ్బందికి స్వంత భవనం లేకపోవటం ఆశ్చర్యకరంగా వుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి సారించి, వ్యవసాయశాఖ ఏ.డి కార్యాలయాలకు స్థలం కేటాయించి, నిర్మాణం చేయాలని ఒకవైపు రైతులు, మరోవైపు వ్యవసాయశాఖ సిబ్బంది కోరుతున్నారు.

రహదారిపై రంధ్రం... ప్రమాదాలకు నిలయం

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో మెయిన్ రోడ్డుపై రంధ్రం ఏర్పడింది. శుక్రవారం రాత్రి ఆకస్మికంగా గొయ్యి ఏర్పడటంతో ప్రయాణీకులు అటు వైపు వెళ్ళకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు 10అడుగుల కంటే ఎక్కువగా రంధ్రం ఏర్పడటంతో గతంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసిన సమయంలో రహదారులు. భవనాల శాఖకు చెందిన అధికారులు పర్యవేక్షణలో కాంట్రాక్టర్ రహదారి పనులు చేపట్టడం జరిగిందని, నాసిరకం పనులు చేపట్టడంతో రంధ్రం ఏర్పడి ఉంటుందని స్థానికులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి, తక్షణమే రంధ్రాన్ని పూడ్చి, ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రథమచికిత్స కేంద్రాలు అవసరం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ (గార) : ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి, అనారోగ్యానికి, చిన్నచిన్న గాయాలకు, సాధారణ శరీర రుగ్మతలకు, నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా ఉపయుక్తకరమైన వైద్యవిధానాన్ని అందించే ప్రథమచికిత్సా కేంద్రాల అవసరం ఎంతైనా ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని అంపోలు పంచాయతీ పిలకవానిపేట గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణ మహిమాన్విత ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న గాయాలకు కట్లు కట్టడం, రక్తం పోకుండా ఆపడం, ఊపిరి అందక కష్టముగా ఉన్నప్పుడు కృత్రిమశ్వాస ఇవ్వడం తదితర వైద్యం ప్రథమచికిత్స కిందకే వస్తుందని వివరించారు. ప్రథమ చికిత్స వివిధ రకాల అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో లేదా గాయపడిన వ్యక్తికి సహాయం చేయడానికి ఉపయోగపడుతున్నారు. ఒక వ్యక్తి ప్రమాదకరమైన పదార్థాన్ని తీసుకోవడం, మూర్ఛ లేదా స్ట్రోక్, గుండెపోటును అనుభవించినప్పుడు తక్షణమే ప్రథమ చికిత్స చేసి ఆ వ్యక్తి ప్రాణాలు నిలపగలమని చెప్పారు.

నేడే అక్కలనాయుడు మాస్టర్ 'ద్వితీయ వర్ధంతి'

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మండల ప్రజల ఆరాధ్య దైవం, శక్తి స్వరూపిణి పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణ ఫౌండర్, అణగారిన వర్గాల స్ఫూర్తిదాత, యంగ్ స్టార్ యూత్ క్లబ్ రథసారథి అనకాపల్లి అక్కలనాయుడు మాస్టారు ద్వితీయ వర్ధంతి స్థానిక పైడితల్లమ్మ వారి ఆలయ ప్రాంగణంలో మాస్టర్ స్థూపం వద్ద స్థానిక ప్రజా సంఘాలు, పురప్రజలు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నేటి సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా, ప్రజా, కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన త్యాగధనునికి నివాళులర్పించి ఆయన ఆత్మ శాంతిని చేకూర్చే కార్యక్రమానికి అభిమానులు, ఆయన ఉద్యమ సహచరులు, కార్మిక,బడుగు, బలహీన, కర్షక, శ్రామిక సోదరులు హాజరుకావాలని స్థానిక ప్రజాసంఘనేతల కోరుతున్నారు.

200 మంది సన్నిధాన భవానీలతో భారీ ఊరేగింపు

శాస్త్రులపేట లో ముగిసిన 9 రోజుల భవాని సన్నిధానం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని చిన్నకాగితాపెల్లి పంచాయతీ శాస్త్రులపేట గ్రామంలో 200 మంది భవానీలతో నవరాత్రుల అమ్మవారి దీక్షలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాజేంద్ర గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం విజయ దశిమి పర్వదినాన అమ్మవారికి బారి ఊరేగింపు నిర్వహించారు. కోలాటంగా అమ్మవారి నవరాత్రుల జరిగాయని. ఇంత మంది భవానీలు చూస్తుంటే సాక్షాత్తు అమ్మవారు దిగివచ్చినట్లు ఉందని, ఊరేగింపు కన్నులపండుగగా జరిగింది స్థానికులు తెలియపరిచారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి : మండలం, బి. గొనపపుట్టుగ గ్రామానికి చెందిన నిరుపేద కార్మికుడు మల్లార్పు మోహనరావు(40) కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కుటుంబ పోషణకు పరిస్థితులు కష్టంగా మారాయి. వైద్య ఖర్చులు కూడా భరించలేని పరిస్థితుల్లో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిల్లో 1999-2000 సంవత్సరంలో మోహనరావుతో కలిసి బొరివంక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులు మోహనరావుకు అండగా నిలిచారు. ఆదివారం మోహనరావు ఇంటికి వెళ్లి రూ.37వేలు నగదు సహాయంతోపాటు బియ్యం, కిరాణా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్రి ప్రకాష్, శ్రీరాంపురం సర్పంచ్ బల్లెడ సుమన్, భాస్కర్, రామారావు, వల్లభ, నవీన్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత పండుగలు భక్తితో చేస్తేనే మోక్షం

విశాలాంధ్ర-పోలాకి: గ్రామాల్లో గ్రామ దేవత సంక్రాంతి దీపావళి దసరా పండగలు జరువుకునేటప్పుడు ప్రశాంతంగా భక్తి భావంతో జరుపుకున్నట్లయితే ఆ గ్రామానికి భక్తులకు మోక్షం జరుగుతుందని పోలాకి సబ్ ఇన్స్పెక్టర్ జి.రంజిత్ తెలిపారు. ఆదివారం గంగివలస పంచాయతీలో గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామ పండుగలు జరుపుకునేటప్పుడు గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో ఉండాలే తప్ప తాగి దేవుడిని దర్శించుకోవడం మహా పాపం అని అన్నారు. గ్రామాల్లో కొందరు తాగి తందనాలాడీ గొడవలు జరిగితే ఆ గ్రామానికి చెడ్డ పేరు అని అన్నారు. పండగలు కార్యక్రమాలు జరిగేటప్పుడు పోలీస్ స్టేషన్ కు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించి ఆ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వీరితోపాటు కానిస్టేబుల్ శంకరరావు ఉన్నారు.

పట్టణ ఫుట్‌పాత్ అక్రమాలు తొలగేనా...!

- ఎమ్మెల్యే ఆదేశాలు అధికారులకు పట్టవా
- ఆక్రమణకు అధికార అండేనా..

విశాలాంధ్ర-ఆమదాలవలస: పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ రోజు రోజుకీ పెరిగిపోతుంది. అటు పాలకులు అండ ఇటు అధికారుల అలసత్వం వెరసి ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ కనీస చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజుల్లో కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న వడ్డీలు తొలగించి ఫుట్పాత్ అక్రమాలను అరికడతారన్న సంకేతం ప్రజల్లోకి వెళ్లకముందే వెంటనే మరికొన్ని ఆక్రమణలు జరగటం అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం వలన ధృతరాష్ట్ర పాలన కొనసాగుతుందని పట్టణ ప్రజలు అనుకుంటున్నారు. కనీసం ఎమ్మెల్యే ఆదేశాలను కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రయాణికులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆక్రమణ తొలగించాల్సిన బాధ్యత అధి కారులపై లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నా యి. కార్యకర్తల మనోభావాలకు భంగం వాటి లో ఏవిధంగా ప్రస్తుత పాలన జరుగుతున్న ట్లు కార్యకర్తలు బహిరంగ విమర్శలే చేస్తు న్నారు. వైయస్సార్ విగ్రహం నుంచి గేటు బస్టాండు రైతు బజారు వన్ వే ట్రాఫిక్ మీసేవ పాలపోలమ్మ గుడి పోలీస్ స్టేషన్ ముఖ్యంగా కోర్టు ఆవరణ కాలేజ్ ప్రాంతాల్లో కొత్తగా బడ్డీ లు పాకలు వేసి ప్రభుత్వ స్థలాలను ఆక్రమిం చు కుంటున్నారు. అంతేకాకుండా పట్టణ ప్రధాన రహదారిని కూడా వీధి వ్యాపారులు ఆక్రమించుకొని వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కనీసం బస్సులు వెళ్లే సమయంలో కూడా రహదారికి అడ్డం గానే ఉంటూ వాహనదారులకు ఇబ్బందుల కు గురి చేస్తున్నారు. వీటిపై చర్యలు చేపట్టా ల్సిన పురపాలక సంఘ అధికారులు కనీసం అటు వైపు చూడటం లేదు. అంటే పాలకుల అండ అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రయాణీ కులకు ఇబ్బంది కలిగిస్తుంది. ట్రాఫిక్ సమస్య కారణంగానే ఇటీవల కిరాణా వ్యాపారి వాహ నానికి మరో వాహనం ఢీకొనడంతో గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి ప్రధాన కారణం రోడ్లపై ఆక్ర మణలే అని స్పష్టమవుతుంది. ఇదిలా ఉండ గా ఇటీవల మురికి కాలువలలోని సిల్ట్ తొల గించేందుకు 29 లక్షలతో టెండర్లు వేశారు. ఈ పనులు పరిశీలించేందుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ వార్డుల పర్యటన చేపట్టారు. అం దులో భాగంగానే పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాలని యజమాను లతో మాట్లాడి అధికారులకు ఆదేశించారు. అలాగే మురికి కాలువలు ఫుట్పాత్తులు ఆక్ర మించుకున్న వారిని ఖాళీ చేయించాలని లేకుంటే పోలీసుల సహాయంతో వాటిని తొలగించాలని హుకుమ్ జారీ చేశారు. ఆక్ర మణ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న దృశ్య ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వారం రోజుల్లోగా వాటిని ఖాళీ చేస్తామని అప్పుడు స్పష్టం చేసిన ఇప్పటికీ అటువంటి

దాఖలా లు కనిపించడం లేదు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వారికి ఉండే లాలూచీలు స్పష్టంగా కనిపిస్తున్నట్లు తెలియ వచ్చింది. ప్రజలు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులు అటువైపు చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో పలుమార్లు సమీక్ష లు నిర్వహించి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ఆదేశిం చినప్పటికీ వాటి పరిణామాలు అక్కడికే పరిమితమవుతున్నాయి. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఫుట్‌పాత్ ల ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం పురపాలక సంఘ అధికారులపై ఉంది.

ఉన్నత స్థాయిలో నిలవాలి

విశాలాంధ్ర-సోంపేట: పదో తరగతిలో ప్రతిభసాధించిన విద్యాలంతా భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయిలో నిలవాలని ముఖ్యఅతిథులుగా హాజరైన రిటైర్డ్ జిల్లా జడ్జి డి. చిరంజీవులు సోంపేట ఉప ఖజానా అధికారి బంటుపల్లి కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో సోంపేటలో ఆదివారం గత ఏడాది ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస మండలాల్లో పదో తరగతి లో 500లకు పైగా మార్కులు సాధించిన శ్రీశయన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులు మధ్య జరిగిన ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఉన్నత స్థానంలో నివాలంటే ఉన్నతమైన విద్యద్వారా సాధ్యమని అన్నారు. ప్రస్తుతం ఇంటర్ మీడియట్‌లో ఉన్నతమైన లక్ష్యంతో అత్యున్నతమైన ఆశయాలతో ఉత్తమ భవిష్యత్ కోసం విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని అన్నారు. పేద సామాజిక వర్గం నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్తమ భవిష్యత్ కోసం విద్యను మార్గంగా ఎంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దేవాడ మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.3వేలు నగదు పారితోషికం, మెమొంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే విద్యార్థులకు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు హృదయం ఫౌండేషన్ అధ్యక్షులు డా.దుద్ది శ్రీనివాసరావు పచ్చని విలువైన మొక్కలతోపాటు స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీర్రాజు, ఉపాధ్యక్షులు బీన ఆనంద్, పొడుగు కామేష్, టి. జానకిరావు, పి. లోకనాథం, బాబూరావు మాస్టారు, దుద్ది బాలరాజు, తడక మాధవరావు, బళ్ల కాంతారావు, రెల్ల జానకిరావు, జాక కేశవరావు, ఆనింగి గంగరాజు, దూగాన లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు చిరంజీవులు, కళ్యాణ చక్రవర్తులకు చైతన్య దీపిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావును కలిసిన కోత

విశాలాంధ్ర- పలాస : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావును జనసేన నాయకులు పలాస కాశీబుగ్గ మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణ చంద్ర రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలియజేసారు. వీరిద్దరూ పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీకి చైర్మన్‌లుగా వ్యవహరించారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బాబురావు సేవలు ప్రభుత్వానికి ప్రజలకు ఎంతో ఉపయోగ దాయకంగా ఉండాలని అభిలా షించారు. బాబురావుకు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి అధిరోహించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌జిఎఫ్ యువకులు రక్తదానం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బెలగాం గ్రామంలో ఎస్ జి ఎఫ్ సభ్యుడు దూపాన సునీల్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది ఎస్ జి ఎఫ్ సంస్థ సభ్యులు రక్తదానం చేశారు. ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో 37 సార్లు ఎస్ జి ఎఫ్ సభ్యులు రక్తదానం చేసి అత్యవసర సమయాల్లో ఉన్న వారిని ఆదుకున్నారని సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెలగాం గ్రామ యువకులు, ఎస్ జి ఎఫ్ సంస్థ సభ్యులు, ఉద్దానం బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఊరేగింపు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శ్రీ దుర్గా భవాని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో, ఆదివారం దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్ళి ప్రజలకు ఆశీస్సులు అందించారు. దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా, ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద నిరంతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ ప్రతినిధులు దుర్గాదేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి అందాలని ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన లక్ష్మీ నరసింహస్వామి కోలాటం చిన్నారులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం పిట్ట వారిపై లక్కివలస పంచాయతీ పెట్టవానిపేట గ్రామంలో శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా, మరువాడ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ కోలాటం చిన్నారులు గ్రూపు కోలాటం డ్యాన్స్ చూపరులను ఆకట్టుకున్నారు. అతి చిన్న వయసులోనే చిన్నారులు అద్భుతంగా నైన ఆనందకరంగా, శ్రవణానందకరంగా కోలాటం చేస్తూ నాట్యం చేసిన దృశ్యాలు మమ్మల్ని ఆకట్టుకున్నాయని లక్కివలస పంచాయతీ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు పిట్ట రాజులు అన్నారు. లక్ష్మీనరసింహస్వామి చిన్నారుల కోలాటం గ్రూప్ నాయకుడు మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో కోలాటం బృందం నృత్యం చేస్తూ అలరించింది. ఈ సందర్భంగా పిట్టవానిపేట గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, గ్రామస్తులు చిన్నారులతో పాటు తిప్పాన మణికంఠ రెడ్డికి ఘనంగా సన్మానం చేశారు.

తాగునీటికి ప్రాధాన్యత : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి : గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడడమే తమ ధ్యేయమని ఎమ్మెల్సీ నర్తు. రామారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం కొత్త పుట్టుగ గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 లక్షలతో మోటర్ బోరు నిర్మాణానికి ఎంపీపీ ప్రతినిధి, వైసిపి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తో కలిసి ఎమ్మెల్సీ రామారావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు నర్తు శివాజీ, వైకాపా నాయులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగుతుంది. ఆదివారం రెండు షిఫ్ కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 340కు 309 మంది హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల) లో 101కు 93 మంది హాజరయ్యారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ పరీక్షలు 21వ తేదీతో ముగుస్తాయి.

ఘనంగా దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో, ద ర్గగుడిలో, కుశాలపురంలోని దుర్గా ఆలయంలో, ఫరీదేపేట జంక్షన్లో ఆలయంలో ఉత్సవాలు జరిగాయి. అలాగే ఎచ్చెర్ల, చిలక పాలెం, చినకొంగరాం తదితర గ్రామాల్లో నిర్వహించిన ఉత్సవాలు శనివారంతో ముగిసాయి.

భజన బృందాన్ని సన్మానించిన టాక్సీ యూనియన్

విశాలాంధ్ర-నరసన్నపేట : మండలంలో కరగాం పంచాయితీ నారాయణపలస గ్రామానికి చెందిన శ్రీ వేంకట సాయి విఘ్నేశ్వర భజన బృందాన్ని శనివారం రాత్రి జై దుర్గా భవానీ టాక్సీ యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. పట్టణంలో శ్రీ దేవి శరన్నవరాత్రులు మహోత్సవాల్లో భాగంగా పది రోజులు పాటు భజనలు చేసిన భజన బృంద సభ్యులకు టాక్సీ యూనియన్ అధ్యక్షులు, సుంకాన వెంకటరమణ, యూనియన్ మాజీ అధ్యక్షులు, ముత్తా కిరణ్‌కుమార్, తట్ట గణేష్ తదితరులు సుమారు 18మంది భజన బృందం సభ్యులకు శాలువాలు కప్పి, సన్మానం చేశారు. ఈ సంధర్భంగా భజన బృందం ఆర్గనైజర్, శిమ్మ లక్ష్మణరావు మాట్లాడుతూ సన్మానం చేసిన టాక్సీ యూనియన్ ప్రతినిధులకు అభినందనలు తెలియచేశారు.

వేలంపాటలో రూ.63,500కు కలశం కైవసం

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మండలం రాపాక గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద శనివారం రాత్రి అమ్మవారి కలశం వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో కలశాన్ని గ్రామానికి చెందిన పండాన రిషిత రూ.63,500లకు కైవసం చేసుకున్నారు. అనంతరం అమ్మవారి కలశంను ఊరేగించారు. ఈ సందర్భంగా తీన్మార్ డప్పులు, డిజె డాన్స్ లతో పాటు పలు సాంస్కృతి కార్యక్రమాలతో దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భవాని భక్తులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.